
సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకి

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్‌-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం అంతరాయం కలిగించింది. -10లో



ఆంజనేయా.. అర్చకుల తీరు మార్చవయా..!

గండి వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకుల తీరు కొంత కాలంగా వివాదాస్పదంగా మారింది. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
30.0/24.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.8 – 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

కడప సెవెన్‌రోడ్స్‌: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు, ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలక సెప్టెంబర్ 2వ తేదీ సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఉత్తర్వులను సంభందిత యాజమాన్యాలు విధిగా పాటించాలని ప్రకటనలో కలెక్టర్ ఆదేశించారు.

రేపటి నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో మంగళవారం నుంచి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని టీటీడీ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో వివిధ కారణాల వల్ల తెలిసీ తెలియక జరిగిన దోషాలను నివారించేందుకు పవిత్రోత్సవాలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

గండి అంజన్నకు రూ.87లక్షల ఆదాయం

చక్రాయపేట: శ్రావణ మాసంలో జరిగిన ఉత్సవాల సందర్భంగా గండి అంజన్న ఆదాయం రూ.87,12,883 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం నాలుగు శనివారాల్లో తలనీలాలు, ప్రత్యేక, వీఐపీ దర్శనం,ఆకుపూజల టికెట్లు లడ్డూ ,పులిహోర ప్రసాదాలు,లడ్డు కవర్ల విక్రయాలు గదుల అద్దె, అన్నదాన చందాల ద్వారా వచ్చిందేనని చెప్పారు.గత ఏడాది కంటే ఈ సారి సుమారు రూ.లక్ష మేర ఆదాయం అధికంగా వచ్చినట్లు తెలిపారు.

నేడు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్‌: బంగళాఖాతంలో అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధర్మవరం–మచిలీపట్నం మధ్య నడుస్తున్న మచిలిపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఆది, సోమవారాల్లో రద్దు చేశారు. ఈ విషయాన్ని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. విజయవాడ సమీపంలోని రాయనపాడు వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఈ రైలును రద్దు చేశారన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

ఇడుపులపాయకు చేరుకున్న వైఎస్ విజయమ్మ, షర్మిల

వేంపల్లె: ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు వైఎస్ విజయమ్మ, పీసీసీ చీఫ్ షర్మిల ఆదివారం రాత్రి చేరుకున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు వారు ఇడుపులపాయలో ఉన్న వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించనున్నారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించేందుకు ప్రముఖులు వస్తుండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్‌: కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. డానియల్ ప్రదీప్, ఉపాధ్యక్షుడు థామస్ జీవన్‌బాబు, కార్యదర్శి సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని కోరారు. అనంతరం క్రీడాపాఠశాల ఫుట్‌బాల్ శిక్షకుడు హరి, డీఎస్‌ఏ ఫుట్‌బాల్ శిక్షకుడు ఎస్.వి.పి. అమృత్‌రాజ్ క్రీడామెలకువల గురించి వివరించారు.

తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూముల ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్‌: రాష్ట్ర వ్యాప్తంగా తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓ కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

- జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 – 246344
- ఆర్డీవో కార్యాలయం, కడప: 08562–295990
- ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 95028 36762
- ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 9989843246
- ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 99490 44735

రాజన్న కీర్తి అజరామరం

- మెట్ట ప్రాంతానికి కృష్ణా జలాలు డాక్టర్ వైఎస్ చలువే
- నిర్లక్ష్యానికి గురైన జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి పరవళ్లు
- రిమ్స్ ద్వారా జిల్లా వాసులకు ఉత్తమ వైద్య సేవలు
- వైవీయూ, ట్రిపుల్ ఐటీతో సాంకేతిక ఉన్నత విద్య
- నేడు వైఎస్ వర్ధంతి



సాక్షి ప్రతినిధి కడప: సరిగ్గా పదిహేనేళ్ల నాడు ఇలాంటి వాతావరణమే తెరపైకి వచ్చింది. అనూహ్య విషాదవార్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు జిల్లాను కలచివేసింది. అభిమాన నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ, తెలుగుతనం ఠీవికి చిహ్నం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి చెందాడని తెలుసుకుని వందలాది గుండెలు ఆగిపోయాయి. లక్షలాది హృదయాలు తల్లడిపోయాయి. దేవుడికి మొక్కని చేతులు లేవు. ఎందుకు అన్యాయం చేశావని నిలదీయని గొంతుకలు లేవు. ఇప్పటికీ తలుచుకొని మదనపడేవారే అధికంగా ఉన్నారు. సొంత జిల్లాలో ఆ పాళ్లు మరింత ఎక్కువ. సమాజంలో ఆయన కీర్తి ఆజరామంగా నిలవడానికి అధికారంలో ఉన్నాన్నాళ్లు చేసిన సేవలే ప్రత్యక్ష తార్కారణం. సోమవారం డాక్టర్ వైఎస్ వర్ధంతి సందర్భంగా వాడవాడలా సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నారు. కుటుంబ సభ్యులు ఇడుపులపాయ ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఒక్క అవకాశం లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి. కోట్లాది మంది అగ్రవర్ణ పేదలు ఉన్నత చదువులు చదివారు. అన్నదాతలకు ఆయువు పట్టు అయ్యారు. కార్మికులకు గొడుగు నీడగా నిలిచారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ, ఎప్పటికీ మరువ రానివని విశ్లేషకులు వివరిస్తున్నారు. తరాలు తరబడి దారిద్ర్యాంతో కొట్టు మిట్టాడుతున్న పేదలను ఫీజురీయింబర్స్‌మెంటు పథకం తలరాతలు మార్చివేసింది. అనారోగ్యంపాలైతే వల్లకాడే దిక్కుగా ఉన్న పేదలకు ఆరోగ్యశ్రీ పథకం పునర్జన్మ కల్పించింది.

ఇళ్లు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించి వైఎస్సార్ వారికి ఓ కల్పవృక్షంలా నిలిచారు. అణగారిన వర్గాల ఉన్నతి కోసం రిజర్వేషన్లు కల్పించి చరిత్రను తిరగరాశారు. వృద్ధులకు పెద్దకొడుకుగా, వితంతువులకు సోదరుడిగా...రైతన్నలకు పెద్దన్నగా ఇలా చెప్పుకుంటూపోతే ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు ఏదో ప్రయోజనం కల్పించిన ఘనత ఆయనకు మాత్రమే సొంతమైంది. ఓవైపు పన్నులు లేకుండా మరోవైపు సంక్షేమ పాలన చేపట్టి, ఇంకోవైపు శాశ్వత అభివృద్ధి పనులకు జీవం పోసి ప్రభుత్వ పాలనంటే ఇలా ఉండాలని భవిష్యత్ తరాలకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదర్శప్రాయుడిగా నిలిచారు.దీంతో యావత్తు భారతదేశానికే మార్గదర్శకుడిగా నిలిచారు. అందుకే ప్రతి హృదయం డాక్టర్ వైఎస్సార్‌కు మందిరమే అయ్యిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

మెట్టప్రాంతానికి కృష్ణాజలాలు...

మెట్టప్రాంతానికి కృష్ణాజలాలు తీసుకొచ్చి సస్యశామలం చేస్తే నా జన్మ ధన్యమని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజోలి రిజర్వాయర్ శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. అప్పటికే జలయజ్ఞం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆ పనుల కారణంగానే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం దక్కిందని పాతతరం నేతలు వివరిస్తు న్నారు. జిల్లాకు ఆయవుపట్టు అయినా గండికోట ప్రాజెక్టు నీటితో కళకళలాడుతుందంటే డాక్టర్ వైఎస్సార్ ప్రత్యేక చలువే. జిల్లా పట్ల ఆయనకు ఉన్న ప్రేమకు ఆ ప్రాజెక్టు ప్రత్యక్ష నిదర్శనం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం విస్తరించి యావత్తు రాయలసీమకు కృష్ణా జలాలను అవలీలగా తెచ్చుకునేందుకు పూలబాట వేశారని ఇప్పటికీ సీమ ప్రజానీకం కొనియాడుతోంది. డాక్టర్ వైఎస్ చెప్పినట్లుగానే మెట్టప్రాంతాలల్లో కృష్ణాజలాలు పరవళ్లు తొక్కుతున్నాయి.

తండ్రిని మించి ఆరోగ్యశ్రీ అమలు

పేదల మదిలో వైఎస్ రాజశేఖరరెడ్డి సుస్థిర స్థానం సంపాదించారు. నేను సైతం పేదల పక్షపాతినేని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేశారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుంటానని స్వతహాగా వెల్లడించిన ఆయన ఆరోగ్యశ్రీని మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టారు. 3,255 రోగాలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకవచ్చారు. రూ.5లక్షల వరకు ఆదాయం ఉన్న కుటుంబాలను సైతం ఆరోగ్యశ్రీ పథకంలోకి వర్తించేలా పథకాన్ని రూపొందించారు. మరోవైపు ఆరోగ్య ఆసరా పథకాన్ని తీసుకవచ్చారు. జబ్బుల బారిన పడిన వారి జీవనానికి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా రోజుకు రూ.225 చెల్లించేలా పథక రచన చేశారు. మరోవైపు పేదలకు ఆర్థిక ఉన్నతికి సహకరించి జిల్లా వ్యాప్తంగా రూ.12,136కోట్లు వివిధ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందించారు. మరోవైపు కేన్సర్ బాధితులకు వైద్యసేవలు, రిమ్స్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి తెచ్చారు. నూతనంగా పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించారు. ఎంసీఐ 50ఎంబీబీఎస్ సీట్లు కూడా అనుమతులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ లేకపోవడంతో ఆ సీట్లు భర్తీ ప్రశ్నార్థకంగా నిలుస్తోంది. ఇలా తండ్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇరువురు జిల్లా అపారప్రేమాభిమానాలు చాటుకున్నారని పలువురు కొనియాడుతోన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి విశేష కృషి...

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటి వరకు పాలకుల వివక్షతతో అభివృద్ధికి ఆమడదూరంలో కడప జిల్లా ఉండిపోయింది. ఐదేళ్ల వైఎస్ హయాంలోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధించింది. ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకవచ్చేందుకు యోగి వేమన యూనివర్శిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, పశువైద్య విద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆస్పత్రి, దంత వైద్యశాల నిర్మించారు. ట్రిపుల్ ఐటీ, ఐజీ కార్ల్ (పశు పరిశోదన కేంద్రం), దాల్మియా సిమెంటు కర్మాగారం, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్, భారతి సిమెంటు కర్మాగారం నెలకొల్పారు. జలయజ్ఞం ద్వారా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పరుగులు పెట్టించారు. సుమారు రూ. 12 వేల కోట్లతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు–నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్సార్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునీకరణ, సర్వరాయ సాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, పైడిపాళెం, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే తెలుగుగంగ పనులను పూర్తి చేసి కృష్ణా జిల్లాలతో బ్రహ్మంసాగర్‌లో నింపిన ఘనత డాక్టర్ వైఎస్ పరమైంది. మెట్ట ప్రాంతాలల్లో కృష్ణా జలాలు పారుతున్నాయంటే అది ఆనాటి వైఎస్సార్ చలువేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఎవరు ఏది అడిగినా కాదనకుండా అభయమిచ్చారని ఇప్పటికీ తలుచుకుంటున్నారు.

'సీమ' ప్రాజెక్టులకు ఆద్యుడు వైఎస్



వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాయలసీమ ప్రాజెక్టుల పరిపూర్తిలో అపార శ్రద్ధ, కృషి జరిపారు. రాయలసీమ నీటి పారుదల ప్రాజెక్టులకు గుండెకాయలాంటి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 50 వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత ఆయనదే. స్వంత పార్టీ వ్యక్తులు వ్యతిరేకించినా, అనేక ఇబ్బందులు ఎదురైనా సాహసోపేతంగా పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచారు. దీనివల్లే తెలుగుగంగ, గాలేరు–నగరి, సోమశిల ప్రాజెక్టులకు తాగు, సాగునీరు అందించే అవకాశం ఏర్పడింది. కరువులతో అల్లాడిన పులివెందుల, రాయచోటి ప్రాంతానికి నీరు వచ్చింది.

– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

వైఎస్సార్ వల్లే గండికోట, చిత్రావతి నీళ్లు



మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వల్లే గండికోట, చిత్రావతి, పైడిపాలెం నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుతం పులివెందుల నియోజకవర్గంలో ఎక్కడ చూసినా భూగర్భజలాలు పెరిగి నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. వైఎస్సార్ మరణించినా ఇప్పటికీ ప్రతి ఒక్కరి గుండెల్లో ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచాయి.

– బి.వెంకటరామిరెడ్డి, తొండూరు మండల రైతుసంఘం నాయకులు, భద్రంపల్లె

ఉన్నతవిద్యకు బాటలు వేశారు



మహానేత వైఎస్ హయాంలో జిల్లాలో ఉన్నతవిద్య అభివృద్ధికి బాటలు పడ్డాయి. వైవీయూ, రిమ్స్, పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల, ట్రిపుల్ ఐటీ ఇలా ఎన్నో సంస్థల ఏర్పాటయ్యాయంటే ఆయన చలువే. దీనివల్ల లక్షల సంఖ్యలో విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించగలుగుతున్నారు.

– ఆచార్య గులాంతారీఖ్, విశ్రాంత రిజిస్ట్రార్, వైవీయూ



కుశలమా: పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయంలో అభిమానులను పలుకరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



యువత కేరింత: వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో యువకుల ఉత్సాహం..

ప్రజలకు అండగా నిలవండి

- ఎలాంటి సమస్యైనా వెనుకడుగు వేయవద్దు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- కిడ్నీ బాధితుడికి అండగా నిలవాలని ఆదేశం
- వెంకటప్ప స్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహం
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప/పులివెందుల: ఎలాంటి సమస్యైనా సరే, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వైఎస్సార్‌సీపీ శ్రేణులు అండగా నిలవాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో మమేకమయ్యారు. అందర్నీ పేరుపేరునా పలకరించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడొద్దని, శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని, కలిసికట్టుగా పోరాటం చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు.

వెంకటప్ప స్కూల్ విద్యార్థులకు అభినందనలు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గురువు వెంకటప్ప మాస్టారు పేరుతో నెలకొల్పిన పాఠశాల అండర్‌–18 విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా వారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవగా, పట్టుదల, కఠోర సాధన ఉంటే ఎలాంటి గోల్ అయినా సరే సునాయసంగా అందుకోగలమని ఆ దిశగా మీరంతా కృషి చేయాలని అన్నారు.వారికి అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక తర్ఫీదు పొందాలని సూచించారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో కరచాలనం కోసం ఎగబడుతున్న ప్రజలు

చిత్తూరు నుంచి బస్సుల్లో...

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల క్యాంపు కార్యాలయంలో ఉన్నారని తెలుసుకున్న చిత్తూరు జిల్లాకు చెందిన మహిళలు రెండు బస్సుల్లో పులివెందులకు వచ్చారు. అభిమాన నాయకుడిని చూడాలనే తాపత్రయంతో పోటీ పడి ఎగబడ్డారు. మధ్యాహ్న భోజన విరామానికి ఇంటికి వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్ వాహనానికి అడ్డుగా నిల్చొని వైఎస్ జగన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయసాగారు. మిమ్మల్ని చూసేందుకు వచ్చామని వారంతా మూకుమ్మడిగా చెప్పుకొచ్చారు. కాగా పులివెందుల మెడికల్ కళాశాల ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వాస్తవ పరిస్థితిని వివరించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 50 ఎంబీబీఎస్ సీట్లుకు అవకాశం ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇవ్వడం లేదని తెలిపారు. తద్వారా 156మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయని వివరించారు. ఈప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. పెద్దమనస్సు లేదు. న్యాయపోరాటమే శరణ్యమని మాజీ సీఎం వైఎస్ జగన్ వారి సమస్య పట్ల సానుకూలంగా స్పందించారు. అలాగే 90శాతం వికలత్వం ఉన్న ఆదినారాయమ్మ అనే దివ్యాంగురాలికి వస్తున్న ఫింఛన్ కట్ చేయడంపై వివరించారు. ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని వాపోయారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో జిల్లా ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు, పి.రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎస్‌బి అంజాద్ భాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, లబ్బి వెంకటస్వామి (నందికొట్కూరు), కేతిరెడ్డి పెద్దారెడ్డి(తాడిపత్రి), రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

కిడ్నీ బాధితునికి అండ



కిడ్నీ బాధితుడు యువరాజ్ ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ జగన్

పులివెందుల పట్టణంలోని క్రిస్టియన్‌లైన్ యువకుడు యువరాజ్(20) రెండు కిడ్నీలు పాడయ్యాయి. తండ్రి చిన్నతనంలో చనిపోవడంతో తల్లి కుమారి శ్రమించి పోషించింది. కిడ్నీ మార్పిడి తప్పా మరోమార్గం లేదని వైద్యులు తెలపడంతో కుమారి తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అయితే ఆపరేషన్ ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో అభిమాన నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పరిస్థితి వివరించారు. ఆపరేషన్ చేయించి తన బిడ్డను కాపాడాలని కుమారి కోరడంతో అండగా నిలవాల్సిందిగా మాజీ సీఎం వైఎస్ జగన్ తన ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డిని ఆదేశించారు.



వైఎస్ జగన్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులు



వెంకటప్ప స్కూల్ విద్యార్థినులను ఆశీర్వదిస్తున్న వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న నాయకులు

క్లుప్తంగా

4 నుంచి హజరత్ అమీనుల్లా సాహెబ్ ఉరుసు



కడప అమీన్‌పీర్ దర్గా

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పర్యాటక పుణ్యక్షేత్రమైన కడప అమీన్ పీర్ దర్గాలో ఈనెల 4 నుంచి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్తివుల్ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తెలిపారు. ఇందులో భాగంగా 4న గంధం, 5న ఉరుసు, 6న తహలీల్ ఫాతెహా ఉంటాయన్నారు. 5వ తేదీ రాత్రి ప్రముఖ ఖవ్వాలీ గాయకులు అమిల్ ఆరిఫ్ సాబ్రి మిరాట్ కచేరీ ఉంటుందన్నారు.

షూటింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకాలతో జహర్‌తాజ్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మహబూబ్‌నగర్‌కాలనీకి చెందిన జహర్‌తాజ్ షూటింగ్‌లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సొంతం చేసుకుంది. హైదరాబాదు గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ నిర్వహించిన ఉమెన్ అండ్ యూత్ కేటగిరి షూటింగ్‌లో సత్తా చాటి రెండు బంగారు పతకాలు పొందింది. ఆగస్టు 31న విజయవాడ క్లబ్‌లో రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, సాయిలలిత్, కిరణ్‌రెడ్డి ఆమెకు బంగారు పతకాలు అందజేశారు. జహర్‌తాజ్ ప్రొద్దుటూరులో 8 వ తరగతి చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ గుండంరాజుపల్లె గ్రామానికి చెందిన నారిబోయిన సుబ్బమ్మ (83) ఇంటి నుంచి పొలం వద్దకు వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కడప రిమ్స్‌కు తీసుకెళుతుండగా సిద్దవటం సమీపంలోకి వెళ్లేసరికి మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ రాజగోపాల్ కేసు నమోదు చేశారు.

ఆంజనేయా.. అర్చకుల తీరు మార్చవయా.!

- గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో వివాదాస్పదంగా అర్చకుల తీరు
- సోషల్ మీడియా వేదికగా పరస్పరం పోస్టులు
- కొంత కాలంగా రచ్చకెక్కుతున్న వైనం
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు



గండి వీరాంజనేయ స్వామి ఆలయం

చక్రాయపేట : ఎంతో పేరుప్రఖ్యాతులు గల గండి వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకుల తీరు గత కొంత కాలంగా వివాదాస్పదంగా మారింది. భక్తి శ్రద్ధలతో ఆలయానికి వస్తే ఇక్కడి అర్చకుల బూతు పురాణం వినాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో హారతి పల్లెం, తాయత్తులు, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పూజా కార్యక్రమాల నుంచి వచ్చే ఆదాయం కోసమే అర్చకుల మధ్య విభేదాలు తలెత్తాయని పలువురు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే.. నాలుగేళ్ల క్రితం అర్చకుల మధ్య వివాదం చినికి చినికి గాలివానలా మారింది. ఈ సమయంలో ఆలయంలోనే కొట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. దీంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్చకులను కొంత కాలం పాటు సస్పెండ్ చేశారు. దీంతో వారు తాము ఇకపై ఇలా ప్రవర్తించమని సంజాయిషీ ఇచ్చుకుని తిరిగి విధుల్లో చేరారు. అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. వారి తీరు మారలేదు. ఆలయంలో పూజాది కార్యక్రమాలను అమావాస్య నుంచి పౌర్ణమి వరకు ఒకరు, పౌర్ణమి నుంచి అమావాస్య వరకు ఇంకొకరు నిర్వహిస్తూ ఎవరి కాలంలో వచ్చే ఆదాయం వారు తీసుకునేలా ఒప్పందాలు చేసుకున్నారు. అయినా గొడవలు మాత్రం వారి మధ్య సద్దు మణగలేదు. వీరి తీరు ఆలయంలో పని చేస్తున్న సిబ్బందికి కూడా తలనొప్పిగా మారింది.

సామాజిక మాధ్యమాల వేదికగా పరస్పరం పోస్టులు

శ్రావణమాసం చివరి శనివారం నాడు ఆలయ అర్చకుల విభేదాలు మళ్లీ బయట పడ్డాయి. ఈసారి ఆలయ ప్రధాన, ఉపప్రధాన అర్చకులు ఇద్దరూ సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని పరస్పర ఆరోపణలకు దిగారు. స్వామి వారి క్షేత్రోత్సవం, ఆస్థానం వైభవంగా నిర్వహించి అనంతరం శ్రావణ మాస ఉత్సవాలను ముగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమాలకు ఏటా తిరుపతి నుంచి వేదపండితులను రప్పించే వారు. ఈసారి మాత్రం పెంచలకోన పురోహితులను ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి రప్పించారు. ఇందుకు ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ అంగీకరించ లేదు. అయినా ప్రధాన అర్చకుడు కేసరి మాత్రం పెంచల కోన వారినే రప్పించి ఆస్థాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగియకముందే ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ పెంచలకోన అర్చకులచే పూజలు చేయించడం ఆగమ శాస్త్రానికి విరుద్ధమని, మహాదోషమంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఇదిలా ఉండగా కార్యక్రమం జరుగుతున్న సమయంలో పెంచలకోన పురోహితుల మంత్రోచ్చారణలను ఆలయ వేదపారాయణదారుడు రామమోహన్ శర్మ సుతిమెత్తగా తప్పు బట్టారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని పెంచలకోన పురోహితుడు బహిరంగంగానే మైకు చేత పట్టుకొని అందరికీ వినిపించేలా వేలాది మంది భక్తులు, ఆలయ అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలోనే ఇది మేము చెప్పినట్లు జరగాలి. ఇష్టమైతే ఉండొచ్చు లేకుంటే వెళ్లొచ్చు. కాదంటే మేమే వెళ్లి పోతాం అని గట్టిగా చెప్పారు. దీంతో అక్కడ ఉన్న భక్తులు, అధికారులు ముక్కున వేలేసుకున్నారు. కాగా ఉపప్రధాన అర్చకుడు సోషల్ మీడియా ద్వారా చేసిన ఆరోపణలకు ప్రధాన అర్చకుడు ఇతడు అర్చకుడేనా అంటూ పోస్టు పెట్టారు. ఇందులో కుటుంబంలోని మహిళలను సైతం తెరపైకి తీసుకొచ్చారు. ఇలా సోషల్ మీడియా వేదికగా గండి వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకులు ఆలయ ప్రతిష్టను మంట గలుపుతుండటంపై భక్తుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

దడ పుట్టిస్తున్న చిరుత పులుల సంచారం

తొండూరు: మండలంలోని సైదాపురం, అగడూరు, ఇనగలూరు గ్రామాల మధ్య రెండు చిరుత పులులు సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం సైదాపురం, అగడూరు మధ్యలో గల నాగలకట్ట సమీపంలోని ఇసుక మెట్టల వద్ద చిరుతపులి కనిపించిందని గ్రామస్తులు, పశువుల కాపరులు, స్థానికులు తెలిపారు. ఆదివారం ఇనగలూరు, సైదాపురం వాగులో రెండు చిరుత పులులు సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు చూసి స్థానికులకు తెలుపగా వారు వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ప్రజలు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు. రైతులు పొలాలు, తోటల వద్దకు వెళ్లేటప్పుడు ఒక్కొక్కరు వెళ్లకుండా ఇద్దరు, ముగ్గురు గుంపులుగా వెళ్తూ చేతిలో కర్రలు పట్టుకుని వెళ్లాలని వారు సూచించారు.

జిల్లా అంతటా వర్షం

- కాశినాయనలో అత్యధికంగా 31.2 మి.మీ
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు జీవం
- కేసీ నీటి విడుదలకు ముందు 3229 హెక్టార్లలో మాత్రమే వరి సాగు
- ప్రస్తుతం 9886 హెక్టార్లకు చేరుకున్న వైనం
- ఊపందుకోనున్న ఆరుతడి పంటలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వర్షం రాకతో మైదుకూరు ప్రాంతంలో కళకళలాడుతున్న ఉద్యాన పంట ఉల్లి

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండవరోజు జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జల్లులతో కూడిన జడివాడ కురుస్తూనే ఉనింది. జిల్లాలోని కాశినాయన మండలంలో అత్యధికంగా 31.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో ఆరుతడి పంటలైన వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఎంతో మేలు జరిగిందని పలువురు రైతులు తెలిపారు. రెండో రోజు కూడా జల్లులతో కూడిన జడివాన కావడంతో మొక్కల వేర్లకు నీరు బాగా దిగడంతో జీవం పోసుకుని పంటలు కళకళలాడుతున్నాయని రైతులు అంటున్నారు. ఈ వర్షంలో ఆరుతడి పంటలకు సోకిన తెగుళ్లు సైతం దూరమయ్యేందుకు ఆస్కారం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

ఉద్యాన పంటలకు ఎంతో మేలు..

జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పంటలతోపాటు ఉద్యాన పంటలకు మేలు జరిగింది. జిల్లాలో పండ్లు, కూరగాయలు, పూలుతోటలు 55 వేల హెక్టార్లలో ఉన్నాయి. గత రెండు నెలల నుంచి వర్షాలు లేకపోవడంతో మెట్టప్రాంతాలలో సాగులో ఉన్న పండ్లు, పూలు, కూరగాయల తోటలు నీటి సమస్యతో సరిగా లేక కాపు కూడా సరిగా కాయలేదని పలువురు రైతులు తెలిపారు. తాజాగా కురిసిన వర్షంతో బొప్పాయి, మామిడి, బత్తాయి, అరటి, సపోట, దానిమ్మ, నిమ్మ, జామ, పసుపు పంటలు ఊపిరి పోసుకున్నాయి. దీంతో మళ్లీ పండ్లతోటలు కళకళలాడుతున్నాయి.

వరి, ఆరుతడి పంటల సాగుకు మరింత ఊపు..

ఒక వైపు కేసీకి నీరు వస్తుండంతోపాటు మరో వైపు రెండు రోజులపాటు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో వరిసాగుకు మరింత అనుకూల పరిస్థితి ఏర్పడింది. వర్షం నీటితో భూమంతా నానడంతో బోర్లు సౌకర్యం ఉన్న రైతులు కూడా వరిసాగును ముమ్మరం చేశారు. ఆగస్టు 2వ తేదీ కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. దీంతో చాలా మంది రైతులు నారు మడులను సాగు చేసుకున్నారు. సాగు చేసిన నారు మడులకు 20 రోజులు దాటడంతో ప్రస్తుతం కురిసిన వర్షంలో చాలామంది రైతులు వరిసాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో ఆరుతడి పంటలైన మినుము, అలసంద, కంది, ఆముదం, అనప, పొద్దుతిరుగుడు, ఉలవలు వంటి పంటలను సాగు చేసుకోనున్నారు.

జిల్లాలో ఊపందుకున్న వరినాట్లు

కేసీ కెనాల్‌కు నీరు విడుదల కాకమునుపు జిల్లాలో కేవలం 3259 హెక్టార్లలో మాత్రమే వరిపంట సాగైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతోపాటు కేసీ కెనాల్ నీరు రావడంతో వరిసాగును ముమ్మరం చేశారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో 9886 హెక్టార్లకు వరిసాగు చేరుకుంది. ఇంకా కేసీ కెనాల్ కింద 30 శాతం మేర మాత్రమే వరిసాగైంది. ఇంకా 70 శాతం మేర సాగు కావాల్సి ఉంది.

మూడు దుకాణాల్లో చోరీ

పోరుమామిళ్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో దేశాయ్ థియేటర్ వద్ద శనివారం రాత్రి దొంగలు మూడు దుకాణాల్లో చొరబడినట్లు తెలిసింది. రెండు వస్త్ర దుకాణాలు, ఒకటి విత్తనాలు, పురుగు మందుల దుకాణం. వెనుకవైపు తలుపు తాళం పగుల కొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. ఒక షాపులో గల్లా పెట్టెలో చిల్లర నోట్లు మాత్రమే ఉన్నాయని, మరో షాపులో దాదాపు పదివేల రూపాయలు ఉన్నట్లు తెలిసింది. విత్తనాల దుకాణంలో రూ. 28 వేలు నగదు పోయినట్లు తెలిసింది. ఎస్ఐ కొండారెడ్డిని విచారించగా ఒక దుకాణంలో మాత్రమే రూ. 35 వేల విలువ చేసే సెల్ ఫోన్ పోయినట్లు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగల కోసం గాలింపు చేపట్టామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కలికిరి : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కలికిరి క్రాస్ రోడ్డు ఏరియాకు చెందిన కొమ్మలపాటి క్రిష్ణయ్య క్రాస్‌రోడ్డులోని ఎయిర్‌టెల్ టవరు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నిందితుడి వద్ద 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

పోరుమామిళ్ల: మద్యం సేవించి బైక్ నడుపుతుండగా ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామన్నారు.

సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాల అనుమతులు

జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు

కడప అర్బన్ : సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాల అనుమతులు సులభంగా పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్ రూపొందించిందని జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి పొందే విధానం.. గణేష్ ఉత్సవ కమిటీలు 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హెచ్ఐ (హాయ్) అని మెసేజ్ పంపితే నిరభ్యంతర పత్రం (ఎన్.ఓ.సి) కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా ప్రజల మొబైల్ ఫోన్‌కు వస్తుంది.

- ఆ తరువాత ఉత్సవ కమిటీలు గణేష్ ఉత్సవ్ డాట్‌నెట్ అనే వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట రోజు ఏం జరుగుతుంది. నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు. ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓకు వెళుతుంది. ఎస్.హెచ్.ఓ ఆధ్వర్యంలో పురపాలకశాఖ, అగ్నిమాపకశాఖ, విద్యుత్‌శాఖల సిబ్బంది ఒక బృందంలా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే 'క్యూ ఆర్' కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారు. అలాగే అనుమతికి అవసరమైన రుసుము వివరాలను తెలియచేస్తారు. నిర్వాహకులు వారికి దగ్గరలోని మీ సేవా కేంద్రంలో తగిన రుసుము చెల్లించి రసీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత ఎస్.హెచ్.ఓ వాటిని పరిశీలించి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేస్తారు. ఈ నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మంటపంలో ఉంచాలి. పోలీస్ వారు సందర్శన సమయంలో 'క్యూఆర్'కోడ్‌ను స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

నేరాలపై పోలీసుల కన్నెర్ర

జిల్లా పోలీసు శాఖ పనితీరుపై గణాంకాలను విడుదల చేసిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు



కడప అర్బన్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత నెల రోజుల్లో జిల్లా పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను ఆదివారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు పత్రికా ప్రకటనలో వివరించారు.

- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీస్ సిబ్బంది ముమ్మర దాడులు నిర్వహించి గత నెల రోజుల్లో 2096 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ మద్యపానం జరిగే 100 ప్రదేశాలను గుర్తించి మునిసిపల్, పంచాయతీ అధికారుల సమన్వయంతో వాటిని పరిశుభ్రంగా చేశారు. 30 పాఠశాలల ఆవరణంలో పిచ్చి మొక్కలను, పొదలను తొలగించి విద్యార్థులకు ఆహ్లాదకరంగా ఉండేలా పరిసరాలను తీర్చిదిద్దారు.
- జిల్లా వ్యాప్తంగా 25.01 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 12 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్ట్ చేశారు.
- గ్యాంబ్లింగ్‌కు సంబంధించి 61 కేసుల్లో 354 మందిని అరెస్టు చేసి రూ. 9.03.890 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి రూ. 24,300 నగదును స్వాధీనం చేసుకుని ఒక కేసు నమోదు చేశారు.
- మట్కా నిర్వాహకులపై 23 కేసుల్లో రూ.4.94 లక్షల నగదును స్వాధీనం చేసుకుని 50 మందిని అరెస్ట్ చేశారు.
- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న 64 మందిని అరెస్ట్ చేసి 48 కేసులు నమోదు చేసి 181 టన్నుల ఇసుకను, ఇసుకను తరలిస్తున్న 52 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- జిల్లా వ్యాప్తంగా అక్రమమద్యం విక్రయాలు, రవాణాపై పోలీసులు దాడులను నిర్వహించి 4429.37 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని 30 కేసుల్లో 39 మందిని అరెస్ట్ చేశారు.
- ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా 33 కేసుల్లో 130 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో 585 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం



రోడ్డు ప్రమాద దృశ్యం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ రఫీ

ఖాజీపేట : కొత్త బైకును కొనుగోలు చేసి వస్తూ ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కడప- కర్నూలు జాతీయ రహదారిపై దుంపలగట్టు టోల్‌గేట్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేటకు చెందిన గజ్జల వెంకటదినేష్‌రెడ్డి (19), అతని మిత్రుడు సాన వెంకటరమణ (24) ద్విచక్రవాహనం కొనుగోలు చేసేందుకు శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరుకు వెళ్లారు. ద్విచక్రవాహనం తీసుకుని వస్తుండగా శనివారం అర్ధరాత్రి సమయంలో ఖాజీపేట మండలం దుంపలగట్టు సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న వాహనాన్ని వీరి ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో బైక్‌లో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే అపస్మరక స్థితిలో పడిపోయారు. అక్కడే ఉన్న టోల్ గేట్ సిబ్బంది వెంటనే ఖాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. టోల్‌గేట్ అత్యవసర వాహనంలో కడప రిమ్స్‌కు పోలీసులు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..

వేముల : మండలంలోని వేల్పుల సమీపంలో గల భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రఫీ(43) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేల్పులకు చెందిన షేక్ రఫీ కూలిపనులు చేసుకుంటూ అమ్మ, అన్నలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శనివారం సొంత పనిమీద వేములకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని నడుచుకుంటూ వస్తుండగా భూమయ్యగారిపల్లె క్రాస్ వద్దకు రాగానే వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుని సోదరుడు బాబావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం అంతరాయం కలిగించింది. కేఎస్ఆర్ఎం మైదానంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 15 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని సాయిగుణదీప్ 33, తేజారెడ్డి 28 పరుగులతో నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. కర్నూలు బౌలర్ సాబ్జాన్ బాషా 2 వికెట్లు తీశాడు. వర్షం ప్రారంభం కావడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు.

అర్జున్ టెండూల్కర్ సెంచరీ..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 24.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 71 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్సర్లతో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా యోగానంద 31 పరుగులతో క్రీజులో ఉన్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు.

యువకుడిని ఢీకొన్న కారు



ప్రమాదంలో గాయపడిన హరికృష్ణ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల - కొమరోలు రోడ్డులో (కాలువకట్ట) ఇందిరానగర్ వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ఓ కారు ఢీ కొట్టి వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన జింకా హరికృష్ణను కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షం కారణంగా రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో కారు అదుపుతప్పి హరికృష్ణను ఢీ కొన్నట్లు తెలుస్తోంది.

నూతన క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది హరిత

ప్రొద్దుటూరు : ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని న్యాయవాది హరిత పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ పేర్లతో కొత్త చట్టాలను తెచ్చి ప్రజల తరపున పోరాడే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. న్యాయవాది దాదాహయత్ మాట్లాడుతూ దాదాపు పాత చట్టాలనే 85 తిరగరాసి పేర్లు, సెక్షన్ల పేర్లు మార్చి గందరగోళం చేశారన్నారు. మిగిలిన 15 శాతం చట్టాలు వలస పాలకులకంటే క్రూరంగా మార్చారన్నారు. న్యాయవాది సీవీ సురేష్ మాట్లాడుతూ నేరస్తులకు ఇనుప సంకెళ్లు వేయడం ఒక ఆటవిక చర్య అన్నారు. సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలు ప్రభుత్వాలకు, పరపతిగల వారికి అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్మిక సమాఖ్య నాయకుడు సృజన శ్రీను మాట్లాడుతూ సామాజిక స్పృహ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చట్టాలను వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిలానీ బాషా, దళిత సమాఖ్య నాయకుడు ఎల్లయ్య మాదిగ, విద్యావంతుల వేదిక నాయకుడు మహమూద్, రిటైర్డు కలెక్టర్ కేపీ నారాయణరెడ్డి, సీఎంఎస్ నాయకురాలు పద్మ, మహిళా శక్తి నాయకురాలు లక్ష్మీదేవి, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో బది'లీలలు'!

ఆయనో ఉన్నతాధికారి...పదవీ విరమణ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంతలో ప్రభుత్వం ఉద్యోగులను బదిలీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఇంకేం ఉద్యోగ విరమణ చేసే ఆఖరి రోజు కూడా అందినకాడికి దండుకోవాలని ప్రణాళిక రచించారు. ప్రభుత్వం ఈనెల 10వ తేదీ వరకూ నిషేధం విధించినా .. ఇష్టం వచ్చినట్లు బదిలీలు, మీచువల్ ట్రాన్స్‌ఫర్లు చేసేశారు. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

– కడప టాస్క్‌ఫోర్స్

- బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించినా..
- పదవీ విరమణకు ముందే అంతా సర్దేశారు
- అన్యాయం జరిగిందంటున్న క్షేత్రస్థాయి సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిడెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) కడప డివిజన్‌లో బదిలీల్లో అక్రమాలకు తెరలేచింది. రాష్ట్ర ప్రభుత్వం మొదట ఆగస్టు 31 నాటికి బదిలీలు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత ఇంత తక్కువ సమయంలో సాధ్యం కాదని తెలుసుకొని సెప్టెంబర్ 10వ తేదీ వరకూ బదిలీలపై నిషేధం విధిస్తూ 13వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది. కాగా కడప డివిజన్‌లో ఆగస్టు 31 నాటికి ఉన్నతాధికారి ఒకరు పదవీ విరమణ చెందుతున్నారు. ఈలోపే బదిలీల ప్రక్రియ పూర్తి చేసి అందినకాడికి దండుకోవాలని ఉపాయం పన్నారు. ప్రభుత్వం కాదన్నా...నిషేధం విధించినా 31వ తేదీ రాత్రే బది'లీలలు' కానిచ్చేశారు. ఈ మేరకు 10 మంది లైన్ ఇన్స్‌పెక్టర్లు, 12 మంది లైన్‌మెన్లు, నలుగురు అసిస్టెంట్ లైన్‌మెన్లను బదిలీ చేస్తూ మరో ఇద్దరు లైన్ ఇన్స్‌పెక్టర్లు, 8 మంది లైన్‌మెన్లను మీచువల్ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 1వ తేదీ కార్యాలయం నోటీసు బోర్డులో ఉత్తర్వులు దర్శనమిచ్చాయి. ఈ బదిలీలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని పలువురు విద్యుత్ శాఖ సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఐదేళ్లు పూర్తి కాని వారికి కూడా మీచువల్ ట్రాన్స్‌ఫర్లు చేశారని, రూరల్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారికి అన్యాయం చేసి రెండు, మూడేళ్లు పూర్తయిన వారికి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చారని చెబుతున్నారు. ప్రభుత్వం నిషేధం విధించినా ముడుపులకు ఆశపడి చేసిన ఈ బదిలీలను నిలుపుదల చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రభువుకు మరియమాతే తొలి గురువు



దైవ సందేశం అందజేస్తున్న గురువులు

కడప కల్చరల్ : క్రీస్తు ప్రభువుకు తొలి గురువు మరియమాతేనని కడప డాన్‌బాస్కో సలేషియన్ గురువులు రెవరెండ్ ఫాదర్ అశోక్, ఫాదర్ బాపయ్యలు అన్నారు. ఆదివారం ఆరోగ్యమాత ఉత్సవాలలో భాగంగా నాల్గవరోజున ఫాదర్ పాపయ్య దివ్యబలిపూజ సమర్పించగా, అశోక్ మరియతల్లి సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభువైన క్రీస్తు అనుగ్రహం వల్లనే మానవజన్మలోనూ మరియమాత క్రీస్తుకు తొలిగురువుగా అనేక విషయాలను నేర్పిందన్నారు. అలాంటి తల్లి మన కుటుంబాల్లో ఉంటే యువతీ యువకులు మంచి మార్గంలో పయనిస్తారని, దేశానికి ఉన్నతమైన పేరు ప్రఖ్యాతులు గడించి పెట్టగలరని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో మరియతల్లి స్వరూపాన్ని ఏర్పాటు చేసి చర్చి ప్రాంగణంలో డాన్ బాస్కో విద్యార్థులు, విశ్వాసులు ఊరేగింపు నిర్వహించారు. పాటలు, పల్లకీ, దివ్య బలిపీఠం అలంకరణ డాన్ బాస్కో విద్యార్థులు నిర్వహించారు. ప్రార్థనానంతరం పూజ నిర్వహించి ప్రసంగించిన గురువులకు శాంతి సేవా సొసైటీ ప్రతినిధులు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ డాక్టర్ రెవరెండ్ ఎండీ ప్రసాద్‌రావు, బిషప్ కార్యదర్శి ఫాదర్లు లూర్దురాజు, బాలశౌరి, విజయరావు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, జార్జి, లూర్దు, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపరియర్ సెల్వి రాయప్పన్ బృందం, ఆరోగ్యమాత, జేఎంజే, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, చర్చి పెద్దలు సుందరమ్మ, శ్యామలమ్మ, సుశీలమ్మ, స్వరూపరాణి, జయమ్మ, మరియదళం, శాంతి సేవా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.